# 6.5 కాలజ్ఞానం - భవిష్య ద్దర్శనం

## పోతులూరి వీరబ్రహ్మం

కాలజ్ఞానం ప్రవచించే వ్యక్తి పుట్టుకకు పూర్వకాలం భూతకాలంగా, ఆ వ్యక్తి సమాధి అయిన తరువాత కాలం భవిష్యత్ కాలంగా, పుట్టింది మొదలు సమాధి అయ్యేంతవరకు వర్తమాన కాలంగా పరిగణింపబడుతుంది.

భవిష్యత్పురాణకర్త వ్యాసుడు, మధ్యయుగం ఫ్రెంచి దేశీయుడు నోస్ట్రడామస్, కన్నడ దేశపు సర్వజ్ఞుడు, తెలుగు దేశపు వీరబ్రహ్మం కాలజ్ఞానులుగా ప్రసిద్ధి చెందారు.

పోతులూరి వీరబ్రహ్మం వర్తమాన కాలంలో చెప్పిన అంశాలు సమీప భవిష్యత్తులో జరిగాయి. ఈయన భూత, భవిష్యత్, వర్తమానకాల రాజకీయ, మత, సామాజికాంశాలను వివరించారు. రాజకీయ సంబంధమైన అంశాలను భూత, వర్తమాన కాలికాలుగా తెలియజేశారు. విజయనగర సామ్రాజ్య స్థాపన మొదలు పతనం వరకు రాజుల పరిపాలన వర్ణింపబడింది. భవిష్యత్ అంశంగా వీరభోగ వసంతరాయలు నూరు సంవత్సరాలు రాజ్యం చేస్తాడని, అతడు కలియుగంలో అవతరించబోయే విష్ణువని, యుద్ధాలు జరుగుతాయని, తెల్లదొరలు పరిపాలిస్తారని తెలియజేశారు.

భవిష్యదంశంగా మత భేదాలు విస్మరించి ఒకేమతంగా కలిసి మెలిసి జీవిస్తారని కాలజ్ఞానం తెలియజేస్తుంది.మల్లికార్జునుని గుడిలో పొగమంటలు వస్తాయని, గుళ్ళలో దేవుళ్ళకు మూర్తి మంతములు వచ్చి ఊర ఊర నాట్యమాడేరని, తిరుపతి వేంకటేశ్వర గుడిలో మ్లేచ్ఛులు ఆడి పాడే రని, వినాయకుడికి ఊరూర మంత్రాలు చదివేరని, పంచాంగాలు మూలపడతాయని



సూచించారు. సామాజికాంశంగ నదులలో స్త్రీలు జోలలు పాడేరు అని భవిష్యదంశంగా పేర్కొన్నారు . నదులపై చెక్క ఇళ్ళు నిర్మించుకొని సంసార స్త్రీలు నదులపై జోలలు పాడవలసి వస్తుంది. స్త్రీల కన్నుల నెత్తురు కురిసేను అని పురుషాధిక్య సమాజంలో స్త్రీలు ఎదుర్కొనే సమస్యల్ని వివరించారు. యేమి రారా పోరా అనే మాటలు రావయ్యా పోవయ్యా అనేరు. వాత వరణంలో రాబోయే మార్పులను కాలజ్ఞానంలో సూచించారు. నల్ల గాలి సోకి రాచ పుండ్లు పుట్టి మరణిస్తారని తెలియజేశారు. అమావాస్య నాడు చంద్రోదయం, పగలు నక్షత్రాలు కనిపిస్తాయని అన్నారు. భవిష్యత్ ఉత్పాతాలుగా దేవతామూర్తుల కళ్ళల్లో రక్తం, నీరు కారిందని, నిప్పులు రాలాయని, ప్రజలు విచిత్ర వ్యాధులతో మరణిస్తారని, జంతువులు నాశనమైపోతాయని సూచించారు.[1]

కాల జ్ఞాన స్వరూపం :-

1) కాలజ్ఞానమనగా భూతమును భవిష్యత్తుగా చెప్పట, జరిగిన దానిని జరగ బోవునదిగా చెప్పి తన కాలమును తానే వెనుకకు ఈడ్చుకొనుట - (రాళ్ళపల్లి అనంత కృష్ణ శర్మ) .

2) భూతకాలాన్ని భూత భవిష్యత్ వర్తమాన కాలాలుగా, వర్తమాన కాలాన్ని భూత భవిష్యత్ వర్తమాన కాలాలుగా, భవిషత్ కాలాన్ని భూత భవిష్యత్ వర్తమాన కాలాలుగా సూచించారు.

3) కాలజ్ఞానంలో సంభవించ బొయే సంఘటనలన్నీ ఒక సూచనతొ ముడి పడి ఉంటాయి. ఉదాహరణకు : 1) ప్రజలు వావి వర్తనములు తప్పి నడిచేరు ఇందుకు దృష్టం ఏమంటేను భీమనదిలో తీర్థము ఉప్పులగుటే సాక్షి 2)

1. జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాములవారి కాల జ్ఞానం, వాసిలి వెంకట లక్ష్మీనరసింహారావు, కడప, ప్రథమ ముద్రణ 1974, పంచమ ముద్రణ 1999, పుట 3, 4.

వీరవసంత రాయలు పుట్టినందుకు గురుతు ఏమంటేను నొసల కన్నులు గలవారున్ను బుట్టుటే సాక్షి. 3) గజపతులను ఢిల్లీ వరకు రామరాయలు తరిమి కొడతారు దీనికి సూచన మేడి చెట్టుకు పనస పండు పుట్టుటే సాక్షి.

4) సూచనలకు వారు ఎన్నుకున్న నేపథ్యాలు ఆకాశం, సూర్య చంద్ర నక్షత్రాలు, రాశులు, గ్రహణాలు, మానవులు, జంతువులు,దేవతా మూర్తులు, చెట్లు , నదులు, ధ్వనులు ....... ప్రకృతి సాక్షి.

5) పునరుక్తి ఒక లక్షణంగా కనిపిస్తుంది.

6) భయోత్పాతాల నుండి ప్రజల రక్షణకు మార్గాన్ని సూచిస్తుంది.

7) (ఇది నాడీ కథనాన్ని పోలిన కథనంగా కనిపిస్తుంది). నాడీ వ్యక్తుల జాతకాన్ని సూచిస్తుంది.కాలజ్ఞానం కాల గతిని సూచిస్తుంది కథనానికి ఒక క్రమం ఉండదు.

8) మౌఖిక రూపం, లిఖిత రూపం- దీనికి సంబంధించిన వివరాలు అవసరం.

9) నాడీ కథనాన్ని పోలి ఉంటుంది. నాడీ వ్యక్తి పరమైతే కాలజ్ఞానం కాలగతమైనది.

10) కాలజ్ఞాన ప్రవచనానికి బాహ్యచైతన్యంతో పాటు ఆంతరచైతన్యం అవసరం.

బ్రహ్మంగారి మనుమరాలు ఈశ్వరమ్మ (క్రీ.శ. 1695-1803) కలియుగం 500 సంవత్సరాల మీదట ప్రపంచమంతా బహుప్రళయాలతో బీభత్సంగా ఉంటుందని, యుద్ధాలతో మోహినీ శక్తులుద్భవించి, గాలివల్ల నదీ నదులు పొంగి, ప్రపంచమంతా కష్టాల పాలవుతుందని, వీరభోగ వసంతరాయలు వస్తాడని, కలియుగంలో దేవతామూర్తుల కంట నీరు కారేనని చెపుతుంది.[1]

శ్రీ విద్యారణ్య కాలజ్ఞానంలో వీరభోగవసంతరాయలు పేరు, కలియుగం అయిదు వేల సంవత్సరాలు దాటిన కొద్ది కాలానికే యుగసంధి పుట్టి

1 కాలజ్ఞాన సహిత శ్రీ ఈశ్వరమ్మ వారి సంపూర్ణ చరిత్ర - జవంగుల నాగభూషణ దాసు, 2000, పుట 189, 190.



కలియుగాంతమవుతుందని 17వ శతాబ్దంలోని వారైన వీరబ్రహ్మంగారి కంటే దాదాపు నాలుగు వందల సంవత్సరాలకు పూర్వమే తెలిపి ఉన్నారు.

విదేశీయులలో ఫ్రెంచి ద్రష్ట నోస్ట్రడేమస్ (Nostradamous) కాలజ్ఞానంలో భవిష్యదంశాలను తెలియజేసాడు. వీరబ్రహ్మం కాలజ్ఞానంలోని భవిష్యదంశాలు నోస్ట్రడేమస్ తెలిపిన కాలజ్ఞానం భావి కాలగతులతో సరిపోతున్నాయి. ఆకాశం ఎర్రనౌను అని వీరబ్రహ్మం అంటే అణుయుద్ధాలతో జననష్టం కలుగుతుందని నోస్ట్రడేమస్ అన్నారు. ఆరు మతములొక్కటౌను అని వీరబ్రహ్మం చెప్తే భవిష్యత్తులో ప్రపంచ మతాలైన క్రైస్తవ మత్లం, ఇస్లాం మత్లం వంటి ఆరు మతాలు మొత్తం నశించిపోయి ప్రపంచ వ్యాప్తంగా ఒకే ధర్మం నిలుస్తుందని నోస్ట్రడేమస్ భావికాల గతులను సూచించారు. ప్రపంచ యుద్ధం, భూకంపాలు ఏర్పడతాయని ప్రపంచ నాయకుడు వస్తాడని పశ్చిమ దేశాలు నాశనమొందుతాయని వివరించారు.[1]

బైబిల్‌లోనూ, ఖురాన్‌లోను భవిష్యత్తుకు సంబంధించిన సూచనలు ఉన్నాయి. ఈ మత గ్రంథాలు కలియుగాంతాన్ని, రాబోయే ప్రళయాలను గురించి వివరించాయి.

1. 1999 కలియుగాంతం కాలజ్ఞానం, డా. వేదవ్యాస, ముందుమాట, వేద విశ్వ విద్యాలయం, హైదరాబాదు, తృతీయ ముద్రణ, 1999.

# 6.7 జ్యోతిష్యం, నాడీశాస్త్రం - భవిష్యద్దర్శనం

చేతిలోని ప్రతిరేఖా మానవుడు తన భవిష్యత్తును తెలుసుకోవటానికి భగవంతుని చేత ఏర్పరచబడినదని దివ్యజ్ఞాన సంపన్నులైన మహర్షులు తెలియజేసారు. అరచేతిలో ఏయే రేఖ ఎక్కడ ఉన్నదో, ఏయే ఫలితాలను కలిగిస్తుందో తెలియజేసేదే సాముద్రిక శాస్త్రం. తమ భవిష్యత్తును సులభంగా తెలుసుకోవటానికి భగవంతుడు వారివారి శరీరాలపై పుట్టుమచ్చలు, సుడులు, హస్తరేఖలు కల్పించాడని అంటారు. జీవితంలో సంభవించే కష్టసుఖాలను తెలుసుకునే విధానాన్ని సాముద్రిక శాస్త్రంలో వివరించారు.

సాముద్రిక శాస్త్రాన్ని మొదట సముద్రుడు చెప్పటం వలన, సముద్రంలా అనంతమైనది కావటం వలన ఈ శాస్త్రానికి సాముద్రిక శాస్త్రమని పేరు వచ్చిందంటారు. ముద్రలతో అనగా రేఖలతోసహా కూడుకొనునది కాబట్టి దీనిని సాముద్రిక శాస్త్రమని వ్యవహరించారు. సాముద్రిక శాస్త్రం అతిప్రాచీనమైనది. మొదట సముద్రుడు, తరువాత నారదుడు, గర్గుడు, విష్ణు భక్తుడగు ప్రహ్లాదుడు, వరాహ మిహిరాచార్యుడు, భక్త ముకుందుడు మొదలైన వారెందరో ఈ శాస్త్రాన్ని గురించి విపులంగా చెప్పారు. ఒకప్పుడు పార్వతిదేవి లోకోపకారార్థమై సాముద్రిక శాస్త్ర రహస్యాలను తెలపమని ఈశ్వరుని కోరగా ఈశ్వరుడు పార్వతికి ఈ శాస్త్ర రహస్యాలను తెలిపెనని అదియే హరగౌరీ సాముద్రిక మనే పేరుతో వ్యవహరింపబడింది.[1]

1. హస్త రేఖా శాస్త్రము, జ్యోతిష విశారద వడ్డాది వీర్రాజు సిద్ధాంతి, ఆర్యాపురం, రాజమండ్రి, గొల్లపూడి వీరాస్వామి అండ్ సన్స్, రాజయండ్రి, 1991, పుట 4, 5.



దేవ దేవ మహదేవ త్రికాలజ్ఞ మహేశ్వర,
జ్యోతిషార్ణవ పీయూషం సంక్షేపణ వదస్వమే.[1]

పార్వతీదేవి మహేశ్వరునితో దేవాది దేవ! నీవు వర్తమాన భవిష్యద్భూత కాలాలు తెలిసిన వాడవు. నాకు జ్యోతిషార్ణవ నవనీతాన్న తెలియజేయమని ప్రార్థించింది.

అనుగ్రహార్థం లోకస్యమయి కారుణ్యమా శ్రితః
దైవజ్ఞ శాస్త్రసారం చఫలభాగం వదస్వమే.[2]

ఓ దేవా! లోకాలను అనుగ్రహించటానికి నాపై కారుణ్యముంచి జ్యోతిష్య శాస్త్ర సారమైన ఫలభాగాన్ని చెప్పు అని అడిగినందుకు ఈశ్వరుడు ఈ విధంగా సమాధానమిచ్చాడు.

"శ్రుణుదేవి ప్రవక్ష్యామి సావధానేన చేతసా,
సప్త వింశతి ఋక్షాణాం రాశయో ద్వాదశ స్మృతాః
మేషో వృషశ్చ యుగ్మం చ కర్కిసింహశ్చ కన్యకా,
తులా వృశ్చిక చాపాశ్చ మకరః కుంభమీనకౌ".[3]

అని జ్యోతిషశాస్త్ర సారాన్ని తెలియజేసాడు. జ్యోతిష శాస్త్రం వేదాలలో ఒక భాగమై సర్వజగత్తుకు సర్వశ్రేష్ఠమై నిలిచింది. రవి మొదలైన గ్రహకిరణ

1. జ్యోతిషార్ణవ నవనీతము, ఆంధ్రటీకాతాత్పర్య సహితము, శ్రీ పింగళి వేంకటరామ జోస్యులు, వావిళ్ళరామశాస్త్రులు అండ్ సన్స్, మదరాసు, 1973, పుట 1.

2,3. జ్యోతిషార్ణవ నవనీతము, ఆంధ్రటీకాతాత్పర్య సహితము, శ్రీ పింగళి వేంకటరామ జోస్యులు, వావిళ్ళరామశాస్త్రులు అండ్ సన్స్, మదరాసు, 1973, పుట 1.

ప్రభావానికి ఎంతో సంబంధముందని గ్రహించి ప్రాచీన ఋషులు భృగు, బ్రహ్మ, బృహస్పతి, పరాశర, గర్గ, వ్యాస, అత్రి, వశిష్ఠ, అంగీరస, యవన, సూర్య, శౌనక, వరాహ మిహిరాచార్య మొదలైనవారు వారివారి స్వానుభవాలతో దేశకాల సంప్రదాయలను అనుసరించి జ్యోతిష శాస్త్రాలను రచించారు. సర్వగ్రహ ప్రభావం మానసిక శారీరక శక్తులలో లయమై, ఈ శక్తి వలన జీవులు వివిధ ఖగోళ రాశులలో అనేక గ్రహ సంపుటీకరణాలను పొంది జన్మిస్తున్నారు. లగ్నాది ద్వాదశ భావాలు, నవగ్రహ స్థితులు ఆయా కాలాలలో జనన మొందే జీవుల మానసిక శారీరకాది శక్తులు భిన్న మార్గాలను పొందే క్రమాన్ని సూచిస్తుంది. విజ్ఞాన శాస్త్రాలలో ప్రాచీన ఋషి సాంప్రదాయక గ్రంథాలైన భృగు సంహిత, అగస్త్య సంహిత, పరాశర సంహిత, శుక్రనాడి, మార్కండేయ నాడి, చంద్రనాడి, సరస్వతి నాడి మొదలైనవి భారతదేశంలోనే గాక ప్రపంచమంతటా విస్తరించి గ్రీకు రోమనులే గాక ఇతర దేశస్థులు కూడా అవలంబిస్తున్నారు. [1]

నాడీ అనే మాట నుండి పుట్టింది నాడిక, వినాడిక. ఇది ప్రాణ కాల విభాగంగా సంస్కృతంలో చెప్పబడింది. గ్రహాల కలయిక వలన ద్వాదశ రాశి ఫలితాల వల్ల 12 రకాల జాతకాలు ఏర్పడతాయి. పుట్టబోయే జీవుల ఫలితాంశాలను వ్రాయటానికి ఉపయోగించే కాలమానమే నాడీగ్రంథం. ఈ గ్రంథాలలో జాతకుని జీవిత విశేషాలు, భావిలో పొందగల దివ్యానుభవాలు, ఆధ్యాత్మిక, ప్రళయం, విజ్ఞాన, అణుయుద్ధ, ధూమకేతు విశేషాలు వర్ణించబడివున్నవి. [2]

---

1. సర్వజనుల భవిష్యత్ గ్రంథము, దత్త నాడి, ప్రథమ స్కంధము, అవతారిక, ఆళ్ళ సుబ్బారావు, ఎ.ఎస్.రావు అండ్ కో, గుంటూరు, 1992, పుట V.
2. జ్యోతిషం–సైన్సా ? మూఢ విశ్వాసమా ? వేదవ్యాస, శ్రీ వేదవ్యాస భారతీ ప్రచురణలు, 1999, పుట 114.



# 6.7.1 కథలు - భవిష్యద్దర్శనం

కలలను వర్ణించటం, కలలు వాస్తవాలయితే ఆనందమని కవిత్వంలోను, కలలకు అనుసంధానంగా పాత్రల జీవితాలను ముడిపెట్టి చెప్పటం కథలలోను కనిపిస్తుంది. భవిష్యత్తు గురించి కమ్మటి కలలు కనే పాత్రలు మన సాహిత్యంలో మెండుగానే కనిపిస్తాయి.

ఉదాహరణకు పి.లోకేశ్వర్ రాసిన 'కల్లోల కలలమేఘంలో' ఆలోచనల మూలంగా జీవితం ఎలా ఉండాలని ఆశిస్తున్నాడో తెలుస్తుంది. మార్పును ఆశిస్తూ మార్పును అనుసరించిన పాత్రలు, సామాజికంగా మార్పును కాంక్షించే పాత్రలు కనిపిస్తాయి.

ఆర్థిక సరళీకృత విధానాలు నేడు అన్ని రంగాలపై ప్రభావం చూపిస్తూ ఆర్థిక సామాజిక రాజకీయ సాహిత్య రంగాలను ప్రభావితం చేసాయి. ప్రపంచీకరణపై అనుకూల వ్యతిరేక భావాలు ఉన్నప్పటికి సాహిత్యంలో అధికంగా ప్రతికూల భావాలే కనిపిస్తున్నాయి. కథా సాహిత్యంలో ప్రపంచీకరణ వలన వస్తున్న పరిణామాలను మంచిని, చెడునూ రెండింటినీ చిత్రించడం కనిపిస్తుంది.

పెద్దింటి అశోక్ కుమార్ రచించిన 'కీలు బొమ్మలు' కథలో పెద్ద పెట్టుబడితో కంపెనీలు జన్యుపరమైన మార్పులతో కూరగాయ తోటల్ని పెంచబోతుందని, మానవ శరీర వ్యాధులకు కూడ జెనిటికల్లి మాడిఫైడ్ ఫుడ్స్ వాడతారని, రాబోయే కాలంలో దీని వలన హాని కలుగుతుందనే హెచ్చరిక కనిపిస్తుంది.

సలీం రచించిన 'అమ్మకానికి ఆక్సిజన్' కథలో వాతావరణ కాలుష్యం వల్ల ముందు ముందు ఆక్సిజన్ కొనుక్కోవలసిన అవసరం ఏర్పడుతుందని రాబోయే మానవ జాతి  రోగపీడితులుగా ఉంటారని వివరించారు.

పి.సత్యవతి రాసిన 'సూపర్ మాయ్ సింద్రోమ్' కథలో తల్లి పిల్లల కోసం శ్రమించి, చివరకు తన శరీరాన్ని మందులకుప్పగా మార్చుకోవటం కథావస్తువు. పిల్లలను స్టేట్స్‌కి పంపించి, వారికోసం అవసరమైనవన్నీ అమర్చి, అందుబాటులోకి తీసుకు రావటమే స్త్రీత్వమనే భావం నేటి సమాజంలో ఏర్పడింది. ప్రతి తల్లీ నేడు సూపర్ మదర్, సూపర్ ఉమెన్ అనిపించుకోవాలని తపన పడటం కనిపిస్తుంది.

రాజకీయ రంగంలోనూ ఇటువంటి పరిణామాలనే ఎదుర్కొనవలసి వస్తుంది. దేశ ప్రయోజనాల కోసం కాకుండా విదేశాల సౌలభ్యం కోసం చట్టాలను చేస్తున్నారు. ప్రభుత్వాలు బాధ్యతలను విస్మరించి ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను హరించి రాజకీయ పార్టీల స్వీయ ప్రయోజనాల కోసం దేశ భవిష్యత్తును, తద్వారా ప్రపంచ భవిష్యత్తును దెబ్బ తీస్తున్నారు.

ప్రపంచీకరణ నేపథ్యంలో ఏర్పడే, ఏర్పడబోయే భౌగోళికమైన మార్పుల వల్ల ఏర్పడబోయే మార్పులను అంచనా వేస్తూ సంతానం క్షయిస్తుందని, వివాహ సంబంధా లుండవని, అనారోగ్యులై రో ఉంటారని, ఆక్సిజన్ కొనుక్కుంటారని తెలియజేసే కథలు తెలుగు సాహిత్యంలో చోటు చేసుకున్నాయి. భవిష్యద్దర్శనాన్ని సూచిస్తూ కొన్ని కథలు వచ్చాయి. ఈ కోణంలో పరిశోధన చేయవలసిన అవసరం ఉంది.



# జ్ఞాపికల వివరణ

* పుట 161 పురాణాలను చారిత్రక నేపథ్యంతో సరిపోల్చి చూడవలసిన అవసరం ఉంది. పురాణాలన్నిటిలోను భవిష్యత్సూచనలుగా యుగధర్మాలుగా పేర్కొనబడిన లక్షణాలను ఒక క్రమంలో పోల్చి బ్రాహ్మణేతర సాహిత్యాలైన జైన బౌద్ధ సాహిత్యాలతో, చారిత్రక శాసన సాహిత్యాలతో పోల్చి పరిశోధన చేయవలసిన అవసరం ఉంది. పురాణాల్లోని అంశాలను వర్గీకరించి రాజకీయ ఆర్థిక సామాజిక అంశాలను పరిశీలించినట్లయితే మతప్రాబల్యం స్థితిగతులు, దాని వెనుక ఉన్న అంతరార్థం అవగతమవుతుంది. పురాణాల క్రమాన్ని కొంతవరకు వస్త్వాధారంగా నిర్ణయించవచ్చు. ఉదాహరణకు పద్మపురాణంలో ఆది శంకరాచార్యులను ప్రచ్ఛన్న బుద్ధుడని పేర్కొన్నారు. ఆ పురాణం శంకరాచార్యుల తరువాత కాలంలో రాయబడిందని తెలుస్తుంది. భవిష్యపురాణంలో వ్యవసాయ కూలీల వేతనాలను గురించి, రొక్కం ఏ రూపంలో ఇవ్వబడిందో వివరింపబడింది. నాణేల ఆధారంగా నిర్ధారించవచ్చు. బౌద్ధ జైన చార్వాక మతాలను ఖండించాలనే ఉద్దేశంతో వచ్చినవే పురాణాలనే అభిప్రాయం ఉంది. పురాణాలు అశోకుని విస్మరించాయనే అపవాదు ఉంది. అశోకుని గురించి, బుద్ధుని గురించి పురాణాలు ప్రస్తావించాయి. ఈ ప్రస్తావన ఉన్న పురాణాలు చివరగా వచ్చిన పురాణాలై ఉండాలి.

# 7. తెలుగు కవిత్వంలో భవిష్యద్దర్శనం

ప్రాచీన సాహిత్యం కాలాన్ని, కాల భావాన్ని, కాల స్వరూపాన్ని, కాల ప్రభావాన్ని వివరిస్తుంది. కాల ప్రభావానికి లోనయినవాడు మేలుగతు లెట్లా పొందుతాడని, కాల సంప్రాప్త మెవరివల్ల తప్పించవచ్చని కాల వికృతులను ఎదుర్కొనటానికి ధృతి, ధర్మైకాంతత అవసరమని, శుభానికైనా అశుభానికైనా కాలమే కర్త యని తిక్కన, కాలం కలిసి వస్తే అల్పులే గొప్పవారవుతారని వేమన, కాలవశాన పరిస్థితులు తారుమారవుతాయని నాచన సోమన(ఉత్తర హరివంశము), కాలానికి వశమైనదే మానవ జీవితం, నీచునిదే కాలమన్నట్లుగా పుష్పగిరి తిమ్మన (సమీర కుమార విజయము), సోమన (ద్విపద భారతము శాంతిపర్వము 1-18.), చిలకమర్తి(ప్రసన్న యాదవము), బలిజేపల్లి లక్ష్మీకాంతం (సత్యహరిశ్చంద్రీయము) మొదలైన వారు తమ రచనలలో కాల ప్రాశస్త్యాన్ని వివిధ రకాలుగా వర్ణించారు.

నన్నయ నుండి నేటి వరకు తెలుగు సాహిత్యంలో కాల పరిణామాన్ని గుర్తించి కాలాన్ని భిన్నకోణాలలో దర్శించిన కవులు అనేకమంది ఉన్నారు. 'కాలుడు రాకమున్నె వెదుకందగు విస్మృత జీవితార్థముల్' అని కాల విలువను గుర్తించి రచనలు చేపట్టారు. ఒకనాటి ఆధునికత కొంత కాలానికి సంప్రదాయ మవుతుంది. కాలగమనంలో సంప్రదాయాలపై తిరుగుబాటు తలెత్తి నూతనత్వాన్ని కోరుకోవటం యుగధర్మం అవుతుంది. ఆ ధర్మాన్ని ఏ కంఠంతో పలుకుతున్నాడు, ఎలా చెపుతున్నాడనే అభివ్యక్తి, అనుభూతి ముఖ్యం. పురాణేతిహాసాలైనా, ప్రబంధాలైనా, శతకాలైనా భావికాల ఆలోచనలు రచనలలో ప్రతిబింబించాలి.

ఏ సాహిత్యమయినా మానవ భవిష్యత్తును వీక్షించే ప్రయత్నం చేస్తుంది, హెచ్చరిస్తుంది, సంస్కరిస్తుంది. భూత భవిష్యద్వర్తమాన కాలాలను విస్మరించి



సాహిత్యం నిలువలేదు అది భావకవుల స్వప్నం కావచ్చు, ఆశాసౌధమే కావచ్చు. అభ్యుదయ కవుల మరోప్రపంచం కావచ్చు, సమతారాజ్యం కావచ్చు. విప్లవ కవుల సాయుధ పోరాట లక్ష్యం కావచ్చు, అనుభూతి ప్రధానం కావచ్చు, అస్తిత్వం కావచ్చు. ఏది ఏమైనా భవిష్యత్తులో పెనుమార్పును సమీపకాలంలోనో, దూరభవిష్యత్తులోనో ఆకాంక్షిస్తూ మానవ మనుగడ సాగిపోతుంది. ఒకనాడు స్తబ్ధంగా వున్న సమాజంలో నేడు చైతన్యం కలిగి ఉద్యమ రూపం దాల్చి సఫలత వైపుగా పయనం సాగిస్తున్నాయి సాహిత్యోద్యమాలు.

## 7.1 సాంప్రదాయ కవిత్వం - భవిష్యద్దర్శనం

"అక్కాలంబున రూపం
బిక్కాలము నందు జూప నెట్లగు గాలం
బొక్క విధంబున నుండక
పెక్కు ప్రకారములనుండు భిన్నావస్థన్" [1]

హనుమంతుడు భీమునితో నాలుగు యుగాల లక్షణాలను వివరిస్తూ ఆకాలం నాటి రూపం ఈ కాలంలో చూడటం సాధ్యం కాదని, కాలం ఒక్క తీరుగా ఉండదని కాలం భిన్నా వస్థలు చెందటం వలననే యుగాలు ఏర్పడతాయని, చరాచర భూతజాలం భిన్నంగా ప్రవర్తించటం జరుగుతుందని కాలధర్మాన్ని వివరించాడు. మంచి చెడులు, కాలంతో పరిణామం యుగ ధర్మంగా భావించటాన్ని గమనించవచ్చు.'గత కాలము మేలు వచ్చు కాలము కంటెన్' అని గతకాలవైభవాన్నే నన్నయ స్మరించాడు. పాండు రాజు మరణా నంతరం వ్యాసుడు సత్యవతితో ఏకాంతమున పలికిన సందర్భంలో సంసార చాంచల్యం, సంపదల క్షణికత్వం నన్నయ వేదాంత జ్ఞాన అనుభవజ్ఞతను స్పష్టపరుస్తుంది.

---

1. నన్నయ, ఆంధ్ర మహాభారతము, అరణ్య పర్వం, 3-334

"మతిఁదలఁపఁగ సంసారం
బతిచంచల; మెండమావులట్టుల సంప
త్ప్రతతులతి క్షణికంబులు;
గతకాలము మేలు వచ్చు కాలము కంటెన్" [1]

తిక్కన కాలంనాటికి కాలం పంచభూతాలకంటె, మనసు కంటె, బుద్ధి కంటె మహత్తరమైనది. పంచభూతాల కంటె మనస్సు, బుద్ధికంటె కాలానికి ప్రాధాన్యమిచ్చాడు. బృహస్పతి 'మాయా' విధానాన్ని గురించి మనువుకు ఉపదేశించిన సందర్భములో కాలప్రాధాన్యాని, కాలతత్త్వాన్ని వివరించారు.[2]

"ధరణి మొదలైన పంచభూతములకంటె
మనసు కంటెను బుద్ధి కంటెను మహత్త
రంబు గాలంబు గాలతత్త్వంబు మిగిలి
యుండు విభుడి జ్జగంబుల కొడయుఁడతడు".[3]

మనసు గొని మనసు బుద్ధిం, గొని బుద్ధి నిదర్శనంబు గొని దర్శనమున్
విను క్రమమున నొదిగించిన, గను బుధు డక్షరుని విష్ణు ఘన
బోధమయున్" [4]

ఇంద్రబలి సంవాదంలో కాలాన్ని గురించి తెలియజేస్తూ

"కళలు గాష్ఠలు లోనుగ,
గలచి దురల గూర్చుకొనుచు
గాలంబు జనంబులవడ్డి కిచ్చునాతని వలె

1. నన్నయ, ఆంధ్ర మహాభారతము, ఆది పర్వం, 5-159,
2,3,4. తిక్కన, ఆంధ్ర మహాభారతము, శాంతిపర్వం, 4-197, 197, 220.
5. తిక్కన, ఆంధ్ర మహాభారతము, శాంతిపర్వము, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, 4-443,



నలవడ బొదివి తనకు వశ్యుల జేయున్" [5]

జనాలకు వడ్డి కిచ్చే అతనిలా కళలు మొదలైన వాటిని, లోభ క్రోధ, కామ భయాదులలో తేలే మనిషిని కాలం తనకు వశపరచుకుంటుంది.

కాలాన్ని ఎవ్వరూ తప్పించుకోలేరని విధి బలీయమనే దృష్టితో రామాయణ కర్తలు కాలాన్ని సూచించారు.

'కాలము నెవ్వడు గడిమి గడవగ నోపున్' [1]

'కాల మెవ్వరు దిరుగంగ బెట్టలేరు విధిత్రిప్పలు దప్పి చనంగ నేర్చునే'[2]

'కాలమన్నియుం జేయుచునుండు గాలము విచిత్రము'

అని పోతనాదులందరూ కాలాన్ని ఒకే రీతిలో దర్శించినవారే.

'ఏమను కాల మందు హరి ఈశ్వరు డేటికి సంభవించె నే
మేమి మొనర్చె నమ్మనువు లేరతడే క్రియ చేయుచున్న వా
డేమేమి నటించు మీదగత మెయ్యది సజ్జను లైన వారు ము
న్నేమని చెప్పచుందురు మునీశ్వర నా కెఱిగింపవే దయన్'

(పోతన, భాగవతము, అష్టమస్కంధము,ప-4).

1. ఈ పద్యంలో హరి ఈశ్వరులు దేనికి సంభవించారు.ఏమేమి చేసారు. ఆ మనువు లేరి.

2. అతడే క్రియ చేయుచున్నవాడు, చేస్తున్నాడు. ఏమేమి నటించు, నటిస్తున్నాడు.

3. మీద గతమెయ్యది - మీద జరగబోయేదేమిటి. సజ్జను లైన వారు ముందేమని చెప్పకొందుర. భూతవర్తమాన భవిష్యకాల దర్శనాన్ని పరీక్షిన్నరేంద్రుడు. శుకయోగీంద్రుని కోరాడని సూతుడు చెప్పాడు. త్రికాలాబాధ్యమైన అవిచ్ఛిన్న లక్షణం పురాణాల్లో కనిపిస్తుంది.

1. అయ్యలార్యుడు, భాస్కర రామాయణం అరణ్యకాండ, 3, 372
2. అయ్యలార్యుడు, భాస్కర రామాయణం, యుద్ధకాండ, 1370.

'వెనకేదో ముందరేదో – వెఱ్ఱి నేను నా
మనసు మరులు దేర – ముందేదొకో
చేరి మీదట జన్మము – సిరులకు నోమేగాని
యేరూపై పుట్టుదునో యెఱుగనేను'

(అన్నమాచార్య సంకీర్తనామృతము సముద్రాల లక్ష్మణయ్య –పుట 110.)

భూత భవిష్యతులు తెలియని వాడనని వర్తమానమేగాని ముందు జన్మల చింతన లేదని కాలతత్త్వాన్ని తెలుసుకొనే ప్రయత్నం చేశాడు. కాలదర్శనంలో అన్నమయ్య కీర్తనలలో కొంత విలక్షణతను గమనించవచ్చు. ఇది పాశ్చాత్య తాత్త్విక దృక్పథంతో పోల్చి చూడదగినది.

'ఒక్కనాటి ప్రపంచము ఒక్కనాటి వలె రాదు
ఒక్క నిముషము వలె నొకటి గాదు !!!
ఒద్దనే కాలమునుండు ఉండుండీ దవ్వయిపోవు

(అన్నమయ్య, ఆధ్యాత్మ సంకీర్తనం. )

'ముగియదు కాలము ముందరి కింకా
దిగని ప్రవాహము దిన దిన మిదిగో'

(అన్నమయ్య, ఆధ్యాత్మ సంకీర్తనం.)

ఈ సందర్భంలో ప్రతిరోజు కొత్త సూర్యుణ్ణి చూస్తున్నట్లుగా ప్రతిదినం ప్రవహించే నదిలో ప్రవేశం నిత్యనూతనమని గ్రీకు తాత్త్వికుడు హిరాక్లిటస్ మాటలు గుర్తుకొస్తాయి. కాలం సమీపంలోనే ఉన్నా దూరమై పోతుందన్నాడు అన్నమయ్య. భక్తి తత్పరతలో తనకు చేరువగా ఉందనిపించేది ఉన్నట్టుగానే కనిపిస్తుంది కాని దూరమైపోయి లేనట్టుగా అనిపిస్తుంది. సంభావ్య భవిష్యత్తును (ప్రాబబుల్ ఫ్యూచర్) సూచిస్తుంది.



### 7.1.1 ప్రబంధాలు

రామాయణం, భారతం పురాణాల కాలంనాటి కాల అవగాహనలో పరిణామాన్ని గమనించినట్లయితే యుగ ధర్మం, విధి అనే తలంపు నుండి తొలగటం కనిపిస్తుంది. 15వ శతాబ్దం పుర్వార్ధంలో ఉన్న పోతన కాలం వంచిస్తుందని, 15వ శతాబ్దం ఉత్తరార్ధంలో ఉన్న అన్నమయ్య కీర్తనలలో కాలం కొత్తగా తోచునని, 16వ శతాబ్దంనాటి శ్రీ కృష్ణ దేవరాయలు కాలం మోసపుచ్చుతుందని

'ఉన్నట్ల యుండ నద్దరి
కిన్నరులను నావ చేర్చు క్రియ వెస దా బో
కున్నట్ల యుండి కాలం
బున్నరులకు వయసు బుచ్చి మోసము దెచ్చున్.' [1]

(శ్రీ కృష్ణదేవరాయలు, ఆముక్త మాల్యద, 2 ఆశ్వాసము)

నావ ఎక్కిన వానికి పయనిస్తున్నానని తెలియకుండానే దరికి చేరిన రీతిగా నరుల వయసు తెలియని రీతిగా కాలం కడపటికి మోసం చేస్తుందని పాండ్యరాజు భోగినీ గృహానికి వెళ్ళే మార్గంలో కాలమహిమను తలపోసి పరితాపం చెందాడు.

కళాపూర్ణోదయం తృతీయా శ్వాసంలో సిద్ధుడు కలభాషిణిని శక్తికి బలివ్వటానికి తెచ్చి కోవెలలో ఉంచుతాడు. పూజనిమిత్తం పువ్వులు తీసుకు రావటానికి సిద్ధుడు బయటకు వెళ్ళినపుడు ఒక ముదుసలి వచ్చి కలభాషిణిని బలి ఇస్తాడని, ఎక్కడికయినా పారిపొమ్మని చెపుతుంది. బలివల్ల సిద్ధునికి

---

1. ఆముక్త మాల్యదా సంజీవని, వేదము వేంకటరాయశాస్త్రి, వేదము వేంకట రాయశాస్త్రి అండ్ బ్రదర్స్, మదరాసు, 1964, పుట 170–171.

అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని చెపుతుంది. సిద్ధుడు కలభాషిణి ఎక్కడున్నా కనిపెట్టగలడని అతడి దూరదృష్టికి భయపడి

"దూరదృష్టియు నెక్కుడ వీనికిని
గాంచునెచ్చటనున్నన్" [1]

తనకు శక్తియే ఆధారమనినమ్మి 'మీదటగా గల వేలు గీల్లెరిగి దప్పింపరామి యెంతము ధ్రువంబు' అని అక్కడినుండి తప్పించే ప్రయత్నం చేస్తుంది.

'కాలము ఒకరీతిగా వచ్చునా ఉండి'

'కాలము పోవును కడకు మాట నిలుచు' అని కాలం కంటే విలువైనది మాట అని క్షేత్రయ్య

'కాలమందఱికిని గర్తయౌ గాని కాలమునకు నొరుల్ కర్తలుగారు'[2] అని వరదరాజు రామాయణకర్త అయిన వరదరాజు కాలమే కర్త అని తెలియజేస్తారు. పానుగంటి లక్ష్మీనరసింహా రావు 'కళ్యాణ రాఘవము'లో

"బాలుకంట గాలంబు తాబేలు వలెను
బ్రాకు ఘనత యందలి యాస బాలుడుంట
వృద్ధుకంట గాలంబు పర్వెత్తు లేడి
రీతి జావునందలి భీతి వృద్ధుడుంట" [3]

బాలునికి కాలం తాబేలు నడకలా, వృద్ధునికి కాలం పరుగెత్తే లేడిలా కనిపిస్తుందని చమత్కార యుక్తంగా వీరి మధ్య తారతమ్యాన్ని పానుగంటి చూపించారు.

---

1. కళాపూర్ణోదయము, పింగళిసూరన, తృతీయాశ్వాసము, పుట 104-112.
2. వరదరాజు రామాయణము, కిష్కింధ కాండ, 378
3. కళ్యాణ రాఘవం, పానుగంటి లక్ష్మీనరసింహారావు.



### 7.1.2 శతకాలు

వేమన, ధూర్జటి, బద్దెన, అప్పల నరసయ్య, మారన వెంకయ్య, ఏనుగు లక్ష్మణ కవి, కంచర్ల గోపన్న శతక వాఙ్మయ కర్తలుగా ప్రసిద్ధి చెందారు. కర్మ, జ్ఞాన, భక్తి, వైరాగ్య, శృంగార, నీతి, విద్య, సామాజికాంశాలను వస్తువులుగా స్వీకరించి శతక రచనకు పూనుకొని సార్వత్రిక సత్యాలను విడమరచి చెప్పటం వలన అవి ఈనాటికీ నిలిచి ఉన్నాయి.

'కూరిమి విరసంబైనను
నెరములే దోచుచుండు నిక్కము సమతీ!'

ప్రేమ మైత్రి ఉన్నచోట తప్పులు కనపడవు. ఆ ప్రేమ మైత్రి లేనిచోట అన్నీ తప్పులుగానే కనిపిస్తాయి.

'చీమలు పెట్టిన పుట్టలు
పాముల కిరవైనయట్లు పామరుడు దగన్
హేమంబుఁగూడఁ బెట్టిన
భూమీశుల పాలఁజేరు భువిలో సుమతీ!'

చీమలు పెట్టిన పుట్టలు పాములకు నెలవైనట్లు పామరుడు కూడబెట్టిన సొమ్ము రాజుల పాలవుతుంది.

'ధనము కూడ బెట్టి ధర్మంబు సేయక
తాను తినక లెస్స దాచుగాక
తేనెటీగ గూర్చి తెరువరి కియ్యదా?
విశ్వదాభిరామ వినుర వేమ!'

లోభి దానధర్మాలు చేయక తాననుభవించక కూడబెట్టిన ధనాన్ని పరుల పాలు చేస్తాడు. తేనెటీగ తాను తాగక పోగు చేసిన తేనెను బాటసారుల పాలు చేస్తుంది కదా.

'సాధనమున పనులు సమకూరు ధరలోన
విశ్వదాభిరామ వినుర వేమ!'

పట్టుదలతో శ్రమిస్తే ఎటువంటి పనినైనా సాధించవచ్చు.

'సద్గోష్ఠి సిరియు నొసగును;
సద్గోష్ఠి కీర్తిఁబెంచు; సంతుష్టియు నా
సద్గోష్ఠియె యొనగూర్చును;
సద్గోష్ఠియె పాపములను చఱచు కుమారా !'

సజ్జన సాంగత్యం, ప్రసంగం సంపదనిస్తుంది. కీర్తిని, తృప్తిని కలిగిస్తుంది. పాపాలను తొలగిస్తుంది.

'లెక్కకురానీయడు కార్యసాధకుడు ధుఃఖంబున్ సుఖంబున్ మదిన్'.

కార్యసాధకుడు నేలపైన గాని పూల పాన్పుపైన గాని ఉపశమిస్తాడు. ఒకసారి కూరలు గాని మరొకసారి విందు భోజనంగాని చేస్తాడు. ఒకసారి బొంత, మరొకసారి పట్టు వస్త్రాలు ధరిస్తాడు. కార్యసాధకుడు సుఖాన్నిగాని దుఃఖాన్ని గాని లెక్క చేయడు.

భూత వర్తమాన సమాజంలోని స్థితిగతులను గుర్తించి తమదైన శైలిలో వాటిని వ్యక్తీకరించి సమాజంలోని కుళ్ళును క్షాళనం చేసి, సామాజిక స్థితులను స్వీకరించటమో తృణీకరించటమో కనువిప్పు కలిగించటమో ప్రధాన లక్ష్యంగా భావించి రచనలు చేసారు. శతకాల్లో జాతీయాలు, సామెతలు, పలుకుబళ్ళు, అన్యభాషాపదాలు, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, సామాజిక స్థితిగతులు ప్రతిఫలిస్తాయి.